క్లుప్తంగా

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మంగళవారం పశువైద్యాధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి నవంబర్ 14వ తేదీ వరకు నెల రోజులపాటు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పునుంతల, చారకొండ పెద్దకొత్తపల్లి, వెల్దండ, ఊర్కొండ మండల పశువైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, శివకుమార్, అశోక్, శ్యాంసుందర్, రాజేష్ కుమార్ కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

చారకొండ: మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో స్కావేంజర్(పారిశుద్ధ్య విభాగంలో పనిచేయుటకు) పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ ఝాన్సీరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ అభ్యర్థులు 10 తరగతి ఉత్తీర్ణులైన అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత అర్హతగల ధ్రువ పత్రాలతో ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

వెల్దండ: మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్ కోసం, ఆదర్శ మోడల్ హస్టల్ హెడ్‌కుక్, హెల్ప్‌కుక్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన మహిళలు 18 సంవత్సరాల వయస్సు పైబడిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 16వ తేది చివరి గడువు ఉందని ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఈశ్వరయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. 1990–91లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు డబ్బులను పోగు చేసుకొని మంగళవారం రూ.21 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఖాలీద్ మాలిక్, అగ్గిస్వామి, శ్రీను, దేవేందర్, వీరేష్, తిరుపతయ్య, బాలునాయక్ పాల్గొన్నారు.

దళితులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

పెద్దకొత్తపల్లి: పెద్దకారుపాములలో దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని బేడ బుడగ జంగాల హక్కుల పోరాట రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దళితులు భూమిని సాగు చేసుకోకుండా కొందరు దాడులకు పాల్పడుతున్నారన్నారు. కృష్ణయ్య, యాదగిరి, నరహరి, ఈశ్వర్, నర్సింహ, భాస్కర్, మహేష్, సుభాష్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

చారకొండ: మండలంలోని అగ్రమారం తండాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మంగళవారం పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఎంపీ మల్లు రవి నిధులు మంజూరు చేశారని మాజీ సర్పంచ్ ప్రశాంత్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రూప్ సింగ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ఆరోగ్య అవగాహన శిబిరం

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో మంగళవారం కార్మికులకు ఆరోగ్య అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైద్యులు సాయిరెడ్డి, విజయ్‌కుమార్ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీపీ, షుగర్ ఉన్న కార్మికులు మందులు వాడడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. డిపో మేనేజర్ ఉమాశంకర్, ఆర్టీసీ ఉద్యోగులు రత్నమ్మ, వెంకటేశ్వర్లు, గౌసోద్దీన్, కేఎం నాయుడు ఉన్నారు.

విద్యతోనే గుర్తింపు

తాడూరు: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని విద్య స్వేచ్ఛ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మరాజు వాసుదేవ్ అన్నారు. మంగళవారం కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సరైన లక్ష్యాలతో ముందుకు వెళ్లాలన్నారు. విద్యా ప్రగతికి ఎల్లవేళలా సహకరిస్తామన్నారు. విద్యార్థుల లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని చదవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీకృష్ణ, ప్రవీణ్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహాన్ని పరిశీలించిన సీఐ

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో సోమవారం మహిళ మృతదేహం వెలుగులోకి రావడంతో కొల్లాపూర్ సీఐ మహేష్, నాగర్‌కర్నూల్ జిల్లా వైద్యాధికారులు, క్లూస్ టీమ్ కలిసి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించారు. అదేవిధంగా క్లూస్ టీమ్ మృతదేహానికి సంబంధించిన కొన్ని వస్తువులను సేకరించారు. అనంతరం వైద్యులు అక్కడే ఆ మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. అనంతరం సీఐ మహేష్, ఎస్‌ఐ రామన్‌గౌడ్ మాట్లాడుతూ వారం రోజుల కిందట మృతిచెందినట్లు ఆనవాళ్లు ఉన్నాయన్నారు. మహిళా వయసు 35 నుంచి 35 వరకు ఉండవచ్చునని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకొని శిక్షిస్తామని వివరించారు.

జీఎస్టీ తగ్గింపు.. రైతులకు ఊరట

- దిగివస్తున్న వ్యవసాయ పరికరాల రేట్లు
- నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు



అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఊరట లభించింది. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండేది. దీంతో రైతులపై పెద్ద ఎత్తున భారం పడేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 5 శాతానికి తగ్గించడంతో వ్యవసాయ పరికరాల ధరలు తగ్గుముఖం పట్టాయి.ప్రస్తుతం ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ధరలు తగ్గడం రైతులకు కాస్త మేలు జరగనుంది.

ఇప్పటి వరకు 950 దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించిన విషయం తెలిసిందే. ఈ పథకానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు కూడా విడుదల చేసింది. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తూ ఈ పథకాన్ని అమలు చేయనుంది. గత యాసంగిలోనే పథకాన్ని ప్రారంభించినప్పటికీ మార్చిలో బడ్జెట్ ముగింపు సందర్భంగా ఏర్పడిన సాంకేతిక కారణాల వల్ల నిధులు రాలేదు. ఈసారి ముందుస్తుగానే ఈపథకానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాకు 1,680 యూనిట్లకు గాను రూ.1.38కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల నుంచి పరికరాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 950 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల15వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకోనున్నారు. ఎంపిక చేసిన రైతుల నుంచి సబ్సిడీ పోను పెట్టుబడి రూపంలో డీడీలను తీసుకోనున్నారు. అక్టోబరు చివరి నాటికి లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి పరికరాలను అందించనున్నారు.

ధరలలో మార్పులు

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో.. ప్రభుత్వానికి వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు సరఫరా చేసే కంపెనీలు కూడా రేట్లలో మార్పులు చేస్తున్నాయి. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీపై పరికరాలను అందజేయనున్నారు. యాంత్రీకరణ దరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు..యూనిట్ల రేట్లను సవరిస్తున్నారు. దీంతో ఈ పథకంలో రైతులపై కూడా ఆర్థికభారం తగ్గనుంది.

15 రకాల పరికరాలు..

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో 15 రకాల పరికరాలు ఉన్నాయి. వాటిలో రోటోవేటర్, ఎండీ ప్లగ్, కల్టివేటర్, డిస్కయారో, కేజీవీల్, పండ్ పర్మార్, రోటో పడ్లర్, పవర్ ట్రిల్లర్, సీడ్ ఫ్రం పర్టిలైజర్‌డ్రిల్, మాన్యువల్ స్ప్రేయర్, బ్యాటరీ ఆపరేటెడ్ స్ప్రే, పవర్ వీడర్, బ్రష్‌కటర్, స్ట్రాబేలర్స్ తదితర పరికరాలను రైతులకు సబ్సిడీపై అందించనున్నారు. జీఎస్టీ సవరించడంతో వీటి ధరలు కూడా తగనున్నాయి.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

యాంత్రీకరణ పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేసి అక్టోబరు చివరి నాటికి పరికరాలను అందజేస్తాం. కేంద్రం వ్యవసాయ పరికరాలపై జీఎస్‌టీ తగ్గించడంతో అందుకు అనుగుణంగా ధరలు తగ్గుతాయి.

– యశ్వంత్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి

కాంగ్రెస్ నాయకులు తీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం

కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు తీరు మార్చుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎడ్మ సత్యం, రాచోటి శ్రీశైలంలు సూచించారు. మంగళవారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము 57 సర్వేనంబర్‌లో మున్సిపాలిటీ కి చెందిన ఐదు ప్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాటిని పరిరక్షించాలని మాత్రమే చెప్పామని, ఏ నాయకుని పేరు, ఏ పార్టీ పేరు చెప్పలేదన్నారు. 10 సంవత్సరాల పాలనలో మునిసిపాలిటీలో అవినీతి అక్రమాలకు దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. అధికారులకు ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్ పై పలుమార్లు కలిసి ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతోనే పత్రికా ముఖంగా సమస్యను వెలుగులోకి తీసుకొచ్చామన్నారు. 2009లో షాహిద్ భూమి విక్రయించాడని 2010లో అప్పటి సర్పంచ్ సుదర్శన్ రెడ్డి భూమి కొన్నవారికి లేఅవుట్ అనుమతి ఇచ్చారని చెప్పారు. భూమి విక్రయించిన వ్యక్తిపై ప్లాట్లు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారాలతో ఎదుటివారిపై బురద చల్లాలనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ షాహిద్, సూర్య ప్రకాష్ రావు, బోజీ రెడ్డి, సైదులు గౌడ్, ఖాదర్, భగత్ సింగ్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ దమయంతి

ఉప్పునుంతల: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అందుబాటులో లభించే ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పండ్లు, పాలు వంటి పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ బీపాషా, పోషణ మాసం కోఆర్డినేటర్ పార్వతి, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ మాసోత్సవాలు

లింగాల: మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన పోషణ మాసోత్సవాలు మంగళవారం ముగింపు సందర్భంగా ఐకేపీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. మండల విద్యాధికారి బషీర్ అహ్మద్, సీడీపీఓ దమయంతి హాజరయ్యారు. తహసీల్దార్ పాండునాయక్, ఏపీఓ ఇమాంఅలీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, సునిత, హెల్త్ సూపర్‌వైజర్ శాంత, ఏఎన్‌ఎంలు రాజీబాయి, యాదాబాయి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సే షరీఫ్



ఊర్కొండ: మండల కేంద్రంలోని కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారి పక్కన గుట్టపై వెలిసిన హజ్రత్ ఖాజా సయ్యద్ యూసుఫొద్దీన్ చిష్తి మిర్జాయి ఖలందరి దర్గాలో 76వ ఉర్సు షరీఫ్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు దర్గాకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

పెద్దకొత్తపల్లి: రైతులు నూనె గింజల పంటలను సాగు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ అన్నారు. వెన్నచెర్లలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పథకంలో భాగంగా మంగళవారం వంద శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఏఓ శిరీష, నాయకులు బాలస్వామి, చంద్రయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, రాముడు, సత్యం, రవికుమార్, భాస్కర్‌రెడ్డి, సుగుణకర్‌రెడ్డి, ఏఈఓ బాలస్వామి, రైతులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



పెంట్లవెల్లి: మండలంలోని జల్‌బాయితండా, తడకలవారి తండా గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ ఇమ్మాన్యుయెల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు కృషి

లింగాల: విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేస్తునట్లు ఎంఈఓ బషీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని జీల్గుపల్లి, దత్తారం ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. త్వరలో నిర్వహించే ఎస్‌ఏ–1 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ఎఫ్ఏ–2 మార్కులను ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం



మార్చాలలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

చారకొండ: దేశంలో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడి అధికారం చేపట్టిందని ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాం గౌడ్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఓటు చోరీపై సంతకాల సేకరణలో ఉద్యమంలో భాగంగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు జమ్మికింది బాల్‌రాం గౌడ్ మాట్లాడుతూ ఓటు చోరీకి పాల్పడి దేశంలో బీజేపి గద్దెనెక్కిందని, వ్యవస్థలను దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పానుగంటి అంజయ్య, లక్ష్మణ్ సత్తార్, తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

కల్వకుర్తి రూరల్: ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయకుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ అన్నారు. మండలంలోని మార్చాలలో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, శేఖరెడ్డి, లక్ష్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, నిజాముద్దీన్, జిత్తు రెడ్డి, దస్తగిరి, భాస్కర్, భారతమ్మ, పాండు, జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే బాకీ కార్డుల ప్రచారం

బిజినేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ బాకీ కార్డులంటూ విష ప్రచారం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అప్పగిస్తే పదేళ్లలో రూ.లక్షల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఆదివాసి రాష్ట్ర కార్యదర్శి వాల్యనాయక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్యాసాని కృష్ణసాగర్, మ్యాతరి సత్యం, కృష్ణ పాల్గొన్నారు.

26న గోరటి వెంకన్నకు సన్మానం



తెలకపల్లి: మండలంలోని గౌరారంలో డాక్టర్ గోరటి వెంకన్నకు ఈ నెల 26న సాహిత్య సంస్థల ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు కళా సంస్థల ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ గోరటి వెంకన్నకు డాక్టరేట్ ప్రదానం చేసిందని దీంతో సన్మాన సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మేధావులు, విద్యావంతులు అత్యధికంగా హాజరుకావాలని కోరారు. అదేవిధంగా సన్మానానికి సంబంధించి ఎంపీ మల్లురవి గోరటి వెంకన్న ఇంటి వద్ద గ్రామస్తులతో సమావేశం అయ్యారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రమణరావు, మామిళ్లపల్లి యాదయ్య, బండపర్వతాలు, యాదయ్య, కురుమూర్తి, సాంబశివుడు, వెంకటయ్య, శ్రీనివాసులు, రఘుకుమార్, నాగరాజు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి

వెల్దండ: బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 18న నిర్వహించే బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎంపీటీసీ లింగంముదిరాజ్, నిరంజన్, రాజులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసే విధంగా రిజర్వేషన్లు చేసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆరోపించారు. బీసీ బంద్‌కు బీఆర్ఎస్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, శ్రీనివాసులు, నారాయణ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాల భవనాన్ని పరిశీలించిన అధికారులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని పంచాయతీరాజ్ డీఈ బసవలింగం, షబ్బీర్‌లు మంగళవారం పరిశీలించారు. పాత భవనాలను తొలగించి నూతన భవన నిర్మాణానికి అధికారులు అంచనా వేశారు. ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సూచన మేరకు భవనాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. నాయకులు శంకర్, రాజు, శేఖర్, అశోక్, నాగేష్ తదితరులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక లాభాలు



రైతులకు సూచనలిస్తున్న రావేఫ్ విద్యార్థులు

తిమ్మాజిపేట: వరి పంటలో చీడపీడల నివారణకు సమగ్ర, సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక లాభాలు ఆర్జించవచ్చని రావేఫ్ విద్యార్థులు సూచించారు. మండలంలోని గొరిటలో మంగళవారం పంటలపై సస్యరక్షణ చర్యలు అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వనపర్తి వ్యవసాయ కళాశాలకు చెందిన పలువురు రావేఫ్ విద్యార్థులు చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కాండం తొలుచు పురుగు నివారణకు నాట్లు వేసే ముందు నారు చివర్లు కత్తిరించాలని దీంతో పురుగు పెట్టే గుడ్లు నశిస్తాయన్నారు. అధికంగా నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. పంట కోతల తర్వాత గట్ల(వద్దు)పై కలుపు లేకుండా చూసుకోవలన్నారు. లింగాకర్షక బుట్టలు ఎకరాకు ఎనిమిది చొప్పున మగ పురుగులను ఆకర్షించేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేపగింజల కషాయం 5 శాతం, వేపనూనే 3 శాతం, పిచికారీ చేయాలని రైతులకు వారు వివరించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు అశ్విని, ఝాన్సీ, ఆలేఖ్య, హిమబిందు, జానకి, ఉషాశ్రీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లు మంజూరు



పెంట్లవెల్లి: బస్టాండ్ అభివృద్ధికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం బస్టాండ్‌ను మండల కాంగ్రెస్ నాయకులు, ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. బస్టాండ్ రూపురేఖలు మార్చేవిధంగా వివిధ నిర్మాణాల కోసం కొలతలు తీసుకున్నారు. నూతన ఆర్‌టీసీ ప్రయాణ ప్రాంగణం మరియు బస్సులు నిల్వడానికి ఆవరణ స్థలం, సీసీ రోడ్ల నిర్మాణం, మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా నూతన మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సదుపాయం కొరకు వాటర్ ట్యాంక్, బస్టాండ్ ఆవరణలో హైమాస్ట్ లైట్లు తదితర అభివృద్ధి కోసం ఆర్టీసీ అధికారులు కొలతలు చేపట్టి అంచనా వేశారు. నిధులు మంజూరు చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ కోట్ల సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్, ఆవుట ఎర్రశ్రీను, మోహన్, రేణు, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కోడేరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ భగవేని నర్సింహులు, ఎస్‌ఐ జగదీష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, షాట్‌పుట్, 100 మీటర్ల రన్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రంతో పాటు షీల్డు అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్‌గౌడ్, బోజ్యానాయక్, అధ్యాపకులు పద్మావతమ్మ, వెంకటదాసు, రమేష్, ప్రవీణ్, రఫీ, వంశీకృష్ణ, బాలనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అధికారిగా ఎడ్మ శ్రీను ఎంపిక

అచ్చంపేట: వరంగల్ జిల్లా జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 16వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించబోయే ఇండియన్ ఓపెన్ అండర్ 23 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు నాగర్ కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన సీనియర్ క్రీడాకారుడు ఎడ్మ శ్రీను యాదవ్ సాంకేతిక అధికారిగా ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సాంకేతిక అధికారిగా బాధ్యతలు అప్పజెప్పినా రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, టెక్నికల్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ క్రీడాకారులు, గ్రామస్తులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దేవాలయాల అభివృద్ధికి ఐక్యత సహకారం

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 160 దేవాలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కర్కస్ తండాను ఆయన సందర్శించారు. తండాలోని ముత్యాలమ్మ దేవాలయం, హనుమాన్ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, శంకర్ నాయక్, నరసింహ, రవి, కరుణాకర్ రెడ్డి, గోపాల్ నాయక్, రాజేందర్, తండావాసులు పాల్గొన్నారు.

దుందుబీ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని వినతి

తాడూరు: మండలంలోని సిర్సవాడ సమీపాన దుందుబీ నదిలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటూ మంగళవారం గ్రామస్తులు కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా దుందుబీ నది ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దుందుబివాగు కొంత ప్రవాహం తగ్గినా నదిపై ఉన్న కాజ్‌వే బ్రిడ్జి దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి మార్చిలో రూ.20 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణం చేపట్టాలని విన్నవించారు.

రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలి

కందనూలు: జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు రిక్వెస్ట్ బస్ స్టాప్ సౌకర్యం కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు డిమాండ్ చేశారు. మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ డిపో మేనేజర్ యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బంగారు బాబు మాట్లాడుతూ కళాశాలకు బస్ రిక్వెస్ట్ స్టాఫ్ లేకపోవడం వల్ల కళాశాల దగ్గర విద్యార్థులకు బస్సులు ఆపడం లేదని, బస్టాండ్ నుంచి కళాశాలకు 2 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సి రావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు సాయంత్రం 4 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి మల్లేష్ యాదవ్, శివ, శివ, రమేష్ ఏబీవీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దు

తెలకపల్లి: బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేష్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గౌరెడ్డిపల్లి గ్రామ సమీపంలో 8 వాహనాల్లో పనులకు వెళ్తున్న 22 మంది బడి ఈడు పిల్లలకు గుర్తించారు. జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ, పోలీసుశాఖ, విద్యాశాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్, కోనేరు సంస్థ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ నిర్వహించారు. వివిధ వాహనాల్లో బడి ఈడు పిల్లలు పత్తి తీసేందుకు వెళ్లనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీయూ శ్రీశైలం, మధుబాబు, చైల్డ్ హెల్ప్‌లైన్, కేసు వర్కర్ ప్రమీల, కోనేరు కోఆర్డినేటర్ అంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ బుక్స్ పంపిణీ



లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌ను పొందుటకు నిర్వహించే పరీక్షకు ఈ పుస్తకాలు దోహదపడుతాయన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు రూ.60 వేల వరకు ఆర్థికసాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌శర్మ, శంకరయ్య, పురుషోత్తం, రమేష్, శేఖర్, రాంచంద్రయ్య, ధరమ్‌సింగ్, శ్రావణ్‌కుమార్, పీడీ వసంత కుమార్‌యాదవ్, శశికళ, చంద్రకళ, మహేశ్వరీ, షమీనాబేగం, యాదమ్మ, సుజాత, రహిమాబేగం, ఫర్హానబేగం తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న నాసరయ్య

మన్ననూర్: డైలీ వైజ్ వర్కర్ల సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని జేఏసీ మండల కన్వీనర్ కల్ములనాసరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ, సంక్షేమ వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న డైలీవైజ్ వర్కర్లు ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన 72 గంటల నిరవధిక సమ్మె మంగళవారంతో రెండవ రోజుకు చేరుకున్నది. సీపీఐ డివిజన్ కార్యదర్శి పెర్ముల గోపాల్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిష్టయ్య, జేఏసీయూ జిల్లా నాయకుడు పర్వతాలు సమ్మెకు మద్దతు తెలిపారు. అనంతరం నాసరయ్య మాట్లాడుతూ 33 రోజులుగా వర్కర్లు సమ్మె చేస్తుంటే పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమ్మె చేస్తున్న వర్కర్లను కొందరు అధికారులు బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీఓ నెంబర్ 64 ను రద్దు చేసి వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సీఐటీయూ టౌన్ కార్యదర్శి రాములు, జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, వర్కింగ్ ప్రసిడెంట్ సురేందర్, పర్వతాలు, ఓం ప్రకాష్, రవి, భరత్, పద్మ, ఎల్లమ్మ, యాదమ్మ, నీల పాల్గొన్నారు.